క్లుప్తంగా

రోడ్డు విస్తరణకు సహకరించాలి



సెట్‌బ్యాక్ లేని వాటిని తొలగిస్తున్న సిబ్బంది

సుల్తానాబాద్: రోడ్డు విస్తరణకు పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత కోరారు. పట్టణంలో రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా మంగళవారం శ్రీరాంపూర్ రోడ్‌లో సెట్‌బ్యాక్ లేకుండా ఉన్న గోడలను జేసీబీ ద్వారా తొలగించారు. మేజర్ గ్రామపంచాయతీ నుంచి మున్సిపల్‌గా మారడంతో జనాభా పెరుగుతోందని, జనాభాకు అనుగుణంగా పట్టణ విస్తీర్ణం దృష్ట్యా అందరూ రోడ్డు విస్తరణకు సహకరించాలని కోరారు. 5వ వార్డ్ కౌన్సిలర్ పారుపల్లి జ్యానేశ్వరి, నాయకులు గుణపతి పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ ఓదెలు

కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామం సమక్కవాడలో నూతనంగా చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను మంగళవారం సర్పంచ్ ఆకుల ఓదెలు ప్రారంభించారు. ఉప సర్పంచ్ రాసకొండ చంద్రమౌళి, వార్డుసభ్యులు గోస్కుల సమ్మక్క, దండె కిషన్, నాయకులు పిడుగు అంజి, గోస్కుల కుమార్, పంచాయతీ కార్యదర్శి నరేశ్ పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో శ్రీవాణి విజయకేతనం



అభినందిస్తున్న కరస్పాండెంట్ శశాంక

సుల్తానాబాద్: శాతవాహన యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో శ్రీవాణి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల కరస్పాండెంట్ రేకులపల్లి శశాంక అన్నారు. పట్టణంలోని కళాశాలలో మంగళవారం ఆయన విద్యార్థులను అభినందించారు. 4, 6వ సెమిస్టర్ ఫలితాలలో బీఎస్సీ, ఎంపీసీఎస్ విభాగంలో 8.92 ఎస్‌జీపీఏతో కళ్యాణపు శివాని ప్రథమ స్థానం, 8.18 ఎస్‌జీపీఏతో సాత్విక ద్వితీయ స్థానం, బీఎస్సీ బీజెడ్‌సీ విభాగంలో నాలుగో సెమిస్టర్‌లో 8.75 ఎస్‌జీపీఏతో మద్దపల్లి రవళి ప్రథమ స్థానం, 8.66ఎస్‌జీపీఏతో వీర నవ్య ద్వితీయ స్థానంలో నిలిచారు. డైరెక్టర్ రేకులపల్లి సుష్మ విద్యార్థులకు డిక్షనరీలు బహూకరించారు. కళాశాల ప్రిన్సిపాల్ బండారి కమలాకర్, బాలసాని శ్రీనివాస్, శ్రీనివాస్ ఉన్నారు.

గురుపౌర్ణమి వేడుకలు

గోదావరిఖనిటౌన్: మాతృశక్తి, దుర్గావాహిని ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు పట్టణంలోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో సోమవారం రాత్రి నిర్వహించారు. అనంతరం యోగా గురువు అన్నపూర్ణను సన్మానించారు. జిల్లా మాతృశక్తి సంయోజిక సూర్యదేవర జ్యోతి, జిల్లా మాతృశక్తి బాధ్యులు భవాని, రజిత, దుర్గావాహిని బాధ్యులు తిరుమల, మమత, జిల్లా కార్యదర్శి అయోధ్య రవి, నగర కార్యదర్శి సత్తెన్న, నాయకులు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులకు హెల్త్‌కార్డులు జారీ



హెల్త్‌కార్డులు అందజేస్తున్న ప్రసన్నకుమార్

జ్యోతినగర్: ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్‌లో మంగళవారం బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో హమాలీ సంఘం, అన్నపూర్ణ కాలనీ ట్రాలీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ సంఘాల సభ్యులకు బీఎస్పీ సీనియర్ నాయకులు దేవునూరి సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో ఫార్చ్యూన్ సిగ్మా హాస్పిటల్ హెల్త్‌కార్డులను 150 మంది కార్మికులకు పంపిణీ చేశారు. బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గోలివాడ ప్రసన్నకుమార్, హాస్పిటల్ సీఈవో ఎం.నరేశ్, బీఎస్పీ నాయకులు ఉదయ్, మల్లేశ్, పోషమల్లు, చంద్రయ్య, బానేష్, శ్రీనివాస్, వాహన్, రఘునాథరెడ్డి, సంతోష్, మల్లేశ్, సతీశ్, కిష్టయ్య ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మల్యాల, జగ్గయ్యపల్లె గ్రామాల్లో పలు పార్టీలకు చెందిన పలువురు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన అజయ్, ప్రశాంత్, అనిల్, వంశీ, శ్రీకాంత్, సతీశ్, సందీప్, నగేశ్‌కు టీపీసీసీ ఉపాధ్యక్షుడు విజయరమణారావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, మాజీ సర్పంచ్ గాజనవేన సదయ్య, నాయకులు వీరయ్య, శ్రీధర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా 'అండర్‌బ్రిడ్జి'లు

- నిర్మాణంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్లు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న పలు గ్రామాల ప్రజలు



నీటితో నిండి ఉన్న అండర్‌బ్రిడ్జి నిర్మాణం

ఓదెల: కాజీపేట్ నుంచి బల్లార్షా సెక్షన్ల మధ్యలో నిర్మిస్తున్న రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణాలు అస్తవ్యస్తంగా మారాయి. కొలనూర్–కొత్తపల్లి రైల్వేస్టేషన్ల సమీపంలోని హరిపురం, ఉప్పరపల్లె, కొత్తపల్లిలో నిర్మిస్తున్న అండర్‌బ్రిడ్జిలు నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మిస్తుండడంతో ప్రయాణికుల రాకపోకలు బంద్ అయ్యాయి. మూడేళ్లుగా నిర్మిస్తున్న అండర్‌బ్రిడ్జిలు ప్రణాళికాబద్ధంగా నిర్మించకపోవడంతో ఆయా గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు.

నిరుపయోగంగా నిర్మాణాలు..

హరిపురం బ్రిడ్జి పూర్తిగా వర్షం నీటితో నిండిపోవడంతో సుల్తానాబాద్ నుంచి ఓదెల, జమ్మికుంటకు వెళ్లే ప్రయాణికుల రాకపోకలు బంద్ అయ్యాయి. బ్రిడ్జిలు నీటితో నిండడం, పక్కన రైలుపట్టాలు ఉండటంతో ప్రయాణికులు కాలినడకన వెళ్తున్నారు. బ్రిడ్జి నిర్మాణం ప్రణాళికాబద్ధంగా నిర్మించకపోవడంతోనే బయట గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని హరిపురం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉప్పరపల్లె గ్రామ శివారులో నిర్మిస్తున్న అండర్‌బ్రిడ్జి పూర్తిగా జలపాతంలా నీటితో నిండింది. దీంతో గ్రామస్తులు కొలనూర్, ఓదెలకు వెళ్లాలంటే ఊరిచివర నుంచి రేగడిమద్దికుంట కొత్తపల్లి మీదుగా ఓదెలకు వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. నీటితో నిండటంతో నిరుపయోగంగా మారిందని వెంటనే బాగుచేయాలని ఇటీవల గ్రామ సర్పంచ్ పల్లె ఓదెలు జీఎంకు వినతిపత్రం సమర్పించారు. అయినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నీటితో నిండి ఉన్న అండర్‌బ్రిడ్జిలో జారిపడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది. కొత్తపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో నిర్మిస్తున్న అండర్‌బ్రిడ్జి మూడేళ్లుగా నత్తనడకన కొనసాగుతుండడంతో ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండల ప్రజలు జిల్లా కేంద్రం పెద్దపల్లికి వెళ్లాలంటే తిప్పలు పడుతున్నారు.

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం..

రైల్వే కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, నాసిరకం పనులతో నిర్మిస్తుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొలనూర్, ఓదెల, కొత్తపల్లి గ్రామాలకు అండర్‌బ్రిడ్జిలు ప్రాణసంకటంగా మారాయి. రైల్వేశాఖ ఉన్నతాధికారులు సైతం అండర్‌బ్రిడ్జిల నిర్మాణాలను పట్టించుకోవడం లేదని ప్రజాప్రతినిధులు ప్రయాణికులు వాపోతున్నారు. ప్రజలకు ఉపయోగ పడేలా నిర్మించి ఇబ్బందులను తొలగించాలని ప్రయాణికులు, గ్రామస్తులు కోరుతున్నారు.

కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి



హరిపురం, ఉప్పరపల్లె, కొత్తపల్లి రైల్వే అండర్ బ్రిడ్జిలు నీటితో నిండి ఉన్నాయి. ఎలాంటి ప్రణాళిక లేకుండా బ్రిడ్జిలు నిర్మిస్తూ.. రూ.కోట్ల నిధులు దుర్వినియోగం చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి. రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది.
– గ్యారవేని నాగరాజు, ఉపసర్పంచ్, హరిపురం

చర్యలు తీసుకోవాలి



రైల్వేశాఖ నిర్మిస్తున్న అండర్‌బ్రిడ్జిలు నీటితో నిండి నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితి. కొలనూర్, ఓదెల, కొత్తపల్లి రైల్వేస్టేషన్ల నుంచి ప్రయాణించాలంటే ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. – దొడ్డె స్వామి, కాంగ్రెస్ నాయకుడు, కొలనూర్

ప్రయాణికుల నరకయాతన



హరిపురం, ఉప్పరపల్లెలో నిర్మిస్తున్న అండర్‌బ్రిడ్జిలు నీటితో నిండటంతో బయట గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి. మూడేళ్లుగా నిర్మిస్తున్న అండర్‌బ్రిడ్జిలు పూర్తికాకపోవటంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. రైల్వేఅధికాలు చొరవ తీసుకొని వెంటనే పూర్తిచేయాలి.
– సిరిశెటి సత్తిబాబు, కొలనూర్

మొక్కుబడిగా మండల సమావేశం



ఎంపీపీని సన్మానిస్తున్న జెడ్పీచైర్మన్ పుట్ట మధు

మంథని: మంథని మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా నిర్వహించారు. ఎంపీపీ కొండ శంకర్ అధ్యక్షతన మంగళవారం మండల సమావేశం జరగగా ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివారు. పలువురు ప్రజాప్రతినిధులు సమస్యలు లేవనెత్తారు. కానీ గతంలో ప్రస్తావించిన సమస్యలకే పరిష్కారం లేదని పలువురు వాపోయారు. కాగా ఎంపీటీసీలు ఎన్నికై నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రజాప్రతినిధులను జెడ్పీచైర్మన్ పుట్ట మధు సన్మానించారు. అంతకుముందు ఆధునీకరించిన ఎంపీపీ చాంబర్, కార్యాలయ గదులను ప్రారంభించారు. జెడ్పీటీసీలు తగరం సుమలత, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఎంపీడీవో రమేశ్ ఉన్నారు.

మంత్రిని కలిసిన మాదిగ ఐక్యవేదిక పాలకవర్గం



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న పాలకవర్గం

ధర్మారం: మాదిగ ఐక్యవేదిక మండల నూతన పాలకవర్గం సభ్యులు మంగళవారం మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కరీంనగర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి ఆధ్వర్యంలో మాదిగ ఐక్యవేదిక పాలకవర్గ సభ్యులు మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా మంత్రి పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపి సంఘ బలోపేతం కోసం పాటు పడాలని సూచించారు. మేడారం ఎంపీటీసీ మిట్ట తిరుపతి, సంఘం మండల అధ్యక్షుడు దూడ సురేశ్, ప్రధాన కార్యదర్శి శాతరాజుల సుమన్, కోశాధికారి ఎదుల్ల ప్రభాకర్, రెడపాక శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు సతీశ్ పాల్గొన్నారు.

వైద్యం కోసం ఎల్‌వోసీ మంజూరు

ధర్మారం మండలం నాయకంపల్లి తండాకు చెందిన సమ్మయ్య అనారోగ్యానికి గురి కాగ మెరుగైన వైద్యం కోసం మంత్రి కొప్పుల ఈశ్వర్ రూ.రెండులక్షల విలువ గల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. ఈ పత్రాన్ని మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందించారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య



మంథని: నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు



జూలపల్లి: అబ్బాపూర్‌లో నివాళి

మంథని: మంథనిలోని బీజేపీ కార్యాలయం, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేర్వేరుగా తెలంగాణ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి నిర్వహించారు.

కమాన్‌పూర్(రామగిరి): కాంగ్రెస్ రామగిరి మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్వామివివేకానంద వర్ధంతి, అల్లూరి సీతారామరాజు జయంతి, దొడ్డి కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోట చంద్రయ్య, నాయకులు తుల సిరాం, బర్ల శ్రీనివాస్, ముత్యాల శ్రీనివాస్, ఉడత శంకర్, నరేశ్, శ్రీధర్, రాజేశ్వర్‌రావు, రామస్వామి పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం ముస్త్యాలలో సర్పంచ్ లావణ్య ఆధ్వర్యంలో మంగళవారం గ్రామ పంచాయతీలో దొడ్డి కొమురయ్య వర్ధంతి, అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహించారు. అనంతరం న్యూఢిల్లీలో ఇంటర్నేషనల్ ఉమెన్ అవార్డు అందుకున్న సర్పంచ్‌ను సన్మానించారు. కార్యదర్శి పరశురాం, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు ప్రెసిడెంట్ ప్రవీణ్ కుమార్, నాయకులు సమ్మయ్య, రాకేశ్, సంజీవ్, సందీప్, శంకర్ పాల్గొన్నారు.

జూలపల్లి: మండలంలోని అబ్బాపూర్‌లో దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, సర్పంచ్ ఈర్ల మల్లేశం, ఎంపీటీసీ దండె వెంకటేశం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు నిట్టు కొమురయ్య, నాయకులు పొట్టాల మల్లేశం, కచ్చు బీరయ్య, జంగం సతీశ్, తొంటి రవీందర్, అమరగాని శ్రీనివాస్, దేవసాని లక్ష్మీనారాయణ, నిట్టు రాములు, తొంటి రాజయ్య ఉన్నారు.

యువత ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలి



మాట్లాడుతున్న డీసీపీ

పెద్దపల్లిరూరల్: యువత ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలని డీసీపీ వైభవ్ గైక్వాడ్ అన్నారు. కాగా మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాత్రి సమయాల్లో బైక్‌లపై తిరగడం, గుంపులుగా ఉంటూ గంజాయి లాంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దన్నారు. గంజాయి మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నట్లు పేర్కొన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ఉచితంగా మధుమేహ పరీక్షలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ఐటీఐ గ్రౌండ్‌లో మంగళవారం డయాబెటిస్ వైద్యపరీక్షలు నిర్వహించారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 60 మందికి షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. క్లబ్ సభ్యులు రేకులపల్లి విజయ, గంప రోహిత్, శశాంక, సాదుల వెంకటేశ్వర్లు, ఈట గంప రోహిత్, జయపాల్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, సత్యనారాయణ, కజ్జపు భగవాన్ పాల్గొన్నారు.

✦పోస్టల్ ఇన్సూరెన్స్‌పై అవగాహన

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పెగడపల్లి గ్రామంలో మంగళవారం పోస్టల్ ఇన్సూరెన్స్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అతి తక్కువ ప్రీమియం కేవలం రూ.399, 396 చెల్లిస్తే ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10లక్షల ప్రమాద బీమా సొమ్మును మృతుడి కుటుంబానికి పోస్టల్ శాఖ తరఫున అందిస్తామని పెద్దపల్లి డివిజన్ పోస్టల్‌శాఖ ఇన్‌స్పెక్టర్ మోహన్‌గౌడ్ పేర్కొన్నారు. ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, సర్పంచ్ ఆరెల్లి సుజాత, ఎంపీటీసీ సుముకం నిర్మల, ఉపసర్పంచ్ సుకేందర్‌రెడ్డి, పోస్టుమాస్టర్లు పాల్గొన్నారు.

✦గడపగడపకూ కాంగ్రెస్

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం కదంబాపూర్ గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు ఇంటింటా తిరుగుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టనున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

✦వివేకానందుని వర్ధంతి

సుల్తానాబాద్: వివేకానందుని వర్ధంతి సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. పద్మశాలి యువజన సంఘం రాష్ట్ర నాయకుడు సామల రాజేంద్రప్రసాద్ నాయకులు దూడం లింగమూర్తి, కుమారస్వామి ఉన్నారు.

✦బోరు మోటార్ అందజేత

కమాన్‌పూర్(రామగిరి): రామగిరి మండలం పన్నూర్ వైకుంఠధామానికి సింగరేణి సంస్థ నుంచి బోర్ మోటార్‌ను మంగళవారం ఆర్జీ–3 జీఎం కె.సుధాకర్‌రావు పన్నూర్ సర్పంచ్ అల్లం పద్మకు అందజేశారు. ఓసీపీ–1 గని రెమిడియేషన్ ప్లాన్‌లో భాగంగా వైకుంఠధామానికి బోర్‌మోటార్ అందజేయనున్నట్లు జీఎం తెలిపారు. అధికారులు రఘుపతి , శ్రీనివాస్, సత్యనారాయణ, రామకృష్ణ, భాస్కర్, ఆకాష్, నాయకుడు తిరుపతి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎస్సై జీవన్

జ్యోతినగర్: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎన్టీపీసీ ఎస్సై బి.జీవన్ అన్నారు. రామగుండం కార్పొరేషన్ మూడు, ఐదో డివిజన్ శివారులో గల ప్రభుత్వ భూమిలో కొందరు కొన్నిరోజులుగా గుడారాలు వేసుకోగా స్థానికులు తమ ప్రాంత ప్రభుత్వ భూమి తమ ప్రాంత పేదలకు ఇవ్వాలని అనడంతో స్వల్ప వివాదం చోటు చేసుకుంది. పోలీసులకు అందిన సమాచారంతో ఎస్సై బి.జీవన్ మంగళవారం సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాలతో మాట్లాడారు. అర్హులైన పేదవారికి ప్రభుత్వ భూములను కేటాయించేందుకు పలు నిబంధనలు ఉంటాయని, ఇష్టానుసారంగా భూములను ఆక్రమించడం సరైన చర్య కాదన్నారు. పేదలు తమకు ఇండ్ల స్థలాలు కావాలని రామగుండం తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

స్పోర్ట్స్ స్కూళ్లలో ఎంపికకు పోటీలు



జ్యోతినగర్: పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

జ్యోతినగర్: రాష్ట్రంలోని స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశ పరీక్షకు సంబంధించిన అంతర్గాం, పాలకుర్తి మండలాలకు చెందిన విద్యార్థులకు మండల స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని ప్రభుత్వ జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో మంగళవారం నిర్వహించిన ఎంపిక పోటీలను పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి, 24వ డివిజన్ కార్పొరేటర్ కొలిపాక సుజాత, మండల విద్యాధికారి సంపత్‌రావు ఎంపిక పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. మండల స్థాయిలో ఎంపికైన వారిని జిల్లా స్థాయి ఎంపిక పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. హెచ్‌ఎం శ్రీధర్, ఫిజికల్ డైరెక్టర్ కొమురోజు శ్రీనివాస్, పీఈటీలు లక్ష్మణ్, శోభారాణి, కవిత, రమ్య, శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో..

సుల్తానాబాద్: సుల్తానాబాద్ ప్రభుత్వ పాఠశాలల మైదానంలో స్పోర్ట్స్ స్కూల్ ఎంపికకు పోటీలకు విద్యార్థుల నుంచి స్పందన లభించింది. పలు పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని పలు క్రీడల్లో రాణించిన వారిని జిల్లా సెలక్షన్ కమిటీకి సిఫారసు చేసినట్లు ఇన్‌చార్జి ఎంఈవో సురేందర్ తెలిపారు. పీఈటీ రమేశ్ ఉన్నారు.

జూలపల్లి మండలంలో..

జూలపల్లి: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం క్రీడా పాఠశాలలో ప్రవేశానికి క్రీడా పోటీలను మండల విద్యాధికారి కవిత ప్రారంభించారు. పీడీ సురేశ్, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు అభినందనలు



అక్షయను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్



శ్రీ వైష్ణవిరెడ్డి



శాలిని

ధర్మారం: మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో పదో తరగతి చదివిన అక్షయ బాసర ట్రిబుల్ ఐటీ విద్యాలయంలో సీటు సాధించింది. ఈ మేరకు మంగళవారం ప్రిన్సిపాల్ మన్నె దీనా విద్యార్థిని అభినందించారు. పదో తరగతిలో 9.7 సాధించిన అక్షయను ప్రిన్సిపాల్, టీచర్లు సన్మానించారు.

జూలపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. 10 జీపీఏ సాధించిన విద్యార్థినులు కోనరావుపేటకు చెందిన బి.శ్రీ వైష్ణవిరెడ్డి, మండల కేంద్రానికి చెందిన శాలినీలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించి తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యోగాల కల్పనలో బీఆర్ఎస్ విఫలం



ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తున్న ఉష

పెద్దపల్లిరూరల్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని, నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష విమర్శించారు. పట్టణంలోని సాగర్‌రోడ్డులో మంగళవారం ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. పట్టణంలో అభివృద్ధి పేరిట రూ.కోట్లు దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. బీఆర్ఎస్‌కు ఇవే చివరి ఎన్నికలని, వచ్చే ఎన్నికల్లో బహుజనులకే రాజ్యాధికారం కట్టబెట్టాలని ఉష కోరారు. నాయకులు దాసరి హనుమయ్య, చంద్రశేఖర్, వెంకటేశ్, రియాజ్, అజీం పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాల విక్రయం



పట్టుబడిన పుస్తకాలతో నేతలు

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలలో విక్రయిస్తున్న పాఠ్యపుస్తకాలను ఏబీవీపీ నేతలు మంగళవారం పట్టుకుని అధికారులకు అప్పగించారు. అనంతరం విద్యాధికారులకు సమాచారం ఇవ్వగా పుస్తకాలను సీజ్ చేశారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న పాఠ్యపుస్తకాలు, స్టేషనరీని అధికారులు సీజ్ చేశారని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రాజశేఖర్ తెలిపారు. నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. నాయకులు కీసర మనీషా, వేల్పుల నాగచంద్ర, రాసురి ప్రవీణ్, సందనవేన ఓమేష్, అరవింద్, జగ్గంపల్లి అభి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వర్షాలు కురవాలని కప్పతల్లి ఆటలు



జూలపల్లి: కప్పతల్లి ఆట ఆడుతున్న గ్రామస్తులు



కాల్వశ్రీరాంపూర్‌లో..

జూలపల్లి: వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని కోరుతూ మండల కేంద్రంలో రైతులు కప్పతల్లి ఆటలు ఆడారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆలయాల్లో జలాభిషేకాలు చేశారు. ఇంటింటా తిరిగి కప్పతల్లిపై జలాభిషేకం చేయించారు. ఉపసర్పంచ్ కొప్పుల మహేశ్, నాయకులు అమరగాని ప్రదీప్‌కుమార్‌గౌడ్, నెరువట్ల హన్మయ్య, మానుమండ్ల శ్రీనివాస్, బుచ్చయ్య, తేజరాజు, సంపత్, భూమయ్య, రాజు శంకరయ్య, లింగయ్య ఉన్నారు.

కాల్వశ్రీరాంపూర్‌లో..

కాల్వశ్రీరాంపూర్: వర్షాలు కురవాలని మండల కేంద్రంలో మంగళవారం గ్రామస్తులు కప్పతల్లి ఆట ఆడారు. మహిళలు బిందెలతో, కడవలతో కప్పతల్లికి నీళ్లు పోశారు.

మత్స్యపారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్‌గా క్రాంతి



మంథని: మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా డైరెక్టర్‌గా మంథని సంఘం అధ్యక్షుడు పోతరవేని క్రాంతికుమార్ ఎన్నికయ్యారు. చైర్మన్ నర్సయ్య సహకారంతో సమస్యలపై పోరాటం చేస్తానని క్రాంతి తెలిపారు.

పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా చక్రపాణి

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడిగా దేవనపల్లి చక్రపాణిని ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. కాలనీలో నిర్వహించిన సంఘం కమిటీ సభ్యుల సమావేశంలో పద్మశాలి సేవా సంఘం నూతన కమిటీని మంగళవారం ప్రకటించారు. అధ్యక్షుడిగా దేవనపల్లి చక్రపాణి, ప్రధాన కార్యదర్శిగా సాంబారి రాజేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఫైమెన్ కమిటీ నాయకులు పేర్కొన్నారు. సంఘం సభ్యులు రాజమల్లు, సాంబశివరావు, ప్రభాకర్, సమ్మయ్య, శంకర్, వెంకటనర్సయ్య, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.